# అనుమానం

— పారనంది నిర్మల

"చాలా రోజుల్నించి మీకొకటి చెప్పాలనుందండీ!"

"ఏంటది?" అన్నాడు అరుణ్ పేపర్లోంచే.

"నన్నపార్థం చేసుకోరని ముందు నాకు మాటివ్వాలి. నన్ను అర్థం చేసుకుంటారు కదా!"

"చూడు శోభా! అంత ఉపోద్ఘాతం దేనికీ? చెప్పదల్చుకుంది సూటిగా చెప్పెయ్!"

"ఈ మధ్య మీ తమ్ముడి ప్రవర్తనేం బాగుండటం లేదు. రోజల్లా నా చుట్టూనే తిరుగుతున్నాడు. నన్ను తాకాలని ప్రయత్నిస్తుంటాడు. మీరూ గమనించారా?"

"నీకేమైనా బుద్ధుందా? వాడి వయస్సెంత? నీ వయస్సెంత? చూట్టానికి భారీగా ఉన్నాడు గాని నాన్న పోవడంతో ఇంటర్ పూర్తి చెయ్యలేక పోయాడు. ఆ పల్లెటూళ్ళో ఇల్లు, పొలాల సమస్యల్లో ఇరుక్కు పోయాడు. ఆ డిగ్రీ పూర్తి చేయిద్దామని పట్టుకొచ్చానిక్కడికి. వేరే పనిలేక ఇంటిపట్టున ఉండటంతో నీకలా అనిపిస్తోందేమో! వాడి వయస్సులో ఉన్నవాళ్ళని చూడు రోడ్లమీద పోరంబోకుల్లా ఎలా తిరుగుతున్నారో!..." కళ్ళెర్ర జేస్తూ అన్నాడు అరుణ్.

"నాకు ముందే తెల్సు. మీరు మీ తమ్ముణ్ణే వెనకేసుకొస్తారని.. మీరు పొద్దున్నెళ్ళి రాత్రికి గాని ఇంటికి చేరరు. మీకేం తెలుసు? కావాలంటే రేపొచ్చే సెకండ్ సాటర్డే, సండే ఇంట్లోనే ఉంటూ రుగా చూడండి!..." అంటూ రుసరుస లాడుతూ వంటింట్లో కెళ్ళిపోయింది శోభ.

అరుణ్ ఏమీ మాట్లాడలేక పోయాడు.

శనివారం ఇంట్లోనే ఉండి న్యూస్ పేపరు, పుస్తకం చదువుతూ హాల్లోనే కూర్చున్నాడు. అతని దృష్టంతా తమ్ముణ్ణి గమనించడంలోనే వుంది.

"వదినా! అన్నయ్య ఇవ్వాళ ఇంట్లోనే ఉన్నాడేంటి?..." తమ్ముడి మాటలకి ఉలిక్కి పడ్డాడు అరుణ్.

"కాఫీ నే చేసిపెడ్తా మీ ఇద్దరూ తాగండివ్వాళ" అంటూ గబగబా వంటింట్లోకెళ్ళి కాఫీ చేసి తీసుకొచ్చాడు.

ఇంతలో చంటాడి ఏడుపు వినిపించింది. శోభ లేవబోతూంటే ఆమె బుజం మీద చెయ్యేసి



"నువ్వు కూర్చో వదినా! నేనూరుకోబెడతాను" అంటూ ఒక్క పరుగున గదిలోకెళ్ళి పిల్లాడిని ఎత్తుకున్నాడు.

కూరలు తరుగుదామని కూరల్తో హాల్లోకొచ్చిన శోభని చెయ్యి పుచ్చుకుని తీసికెళ్ళి సోఫాలో కూర్చోబెట్టి.

"చూడొదినా! నేనెంత సన్నగా తరుగుతానో! మా అమ్మ ఎప్పుడూ అంటూండేది, 'నువ్వు నా కొడుకువి గాదురా! కూతురివి!' అని. అరెరే! నువ్వు బిందె పుచ్చుకుని నీళ్ళు తేవడమేంటి నే తెస్తాగా!" అని శోభ చేతుల్లోంచి బిందె తీసుకుని బైటకెళ్ళాడు.

శోభ రుసరుస లాడుతూ వంటింట్లో కెళ్ళిపోయింది. అరుణ్ ఇదంతా గమనిస్తూనే వున్నాడు.

తమ్ముడి కలుపుగోలుతనానికి సంతోషంగా వున్నా, శోభ ఎందుకు అపార్థం చేసుకుంటుందో అర్థం కాలేదతనికి. దీనికెలాగైనా పరిష్కార మార్గం చూడాలనుకున్నాడు.

మధ్యాహ్నం భోజనాలయ్యాక తమ్ముణ్ణి పిలిచి–"చూడు చిన్నా! మధ్యలో ఆగిపోయిన నీ చదువు పూర్తి చేయించాలని నా తపన. ఇలా ఇంటి పనుల్తో టైము వృధా చెయ్యక బుద్ధిగా చదువుకో. ఇంటి పనుల కోసం పనిమనిషిని పెడతాన్లే! కోర్సుకి కావలసిన పుస్తకాలు, నోట్సులు కొనుక్కొద్దాం రేపు సోమవారం వెళ్ళి. నిన్ను కాలేజీ హాస్టల్లో చేరిస్తాను. నా మాట వింటున్నావుగదా!" అని అరుణ్ తన గదిలో కెళ్ళిపోయాడు.

చిన్న మనసంతా ఏదోలా అయిపోయింది. దొడ్లో కెళ్ళి కర్ర పుల్లలతో గడ్డి పీకడం మొదలెట్టాడు.

చంటాడిని పడుకోబెట్టి శోభ "ఇప్పటికైనా మీకర్థమైందా?" అంది. అరుణ్ బదులివ్వకుండా నిద్రపోయాడు అటు తిరిగి.

మర్నాడు ఆదివారం అరుణ్ కొంచెం ఆలస్యంగా లేచాడు. శోభ వంటింట్లో కాఫీ కలుపుతోంది. పొద్దున్నే లేచి చంటాడితో ఉండే చిన్న కనిపించక పోవడంతో

"చిన్న ఏడీ? పొద్దున్నే ఎక్కడి కెళ్ళాడబ్బా!"

"ఏమో! ఇంకా లేచినట్లు లేదివ్వాళ" అంది శోభ.

చిన్న గదిలోకెళ్ళి చూశాడు అరుణ్. తలమీద కంటా దుప్పటి కప్పుకున్నాడు చిన్న. లేపుదామని దుప్పటి తీసిన అరుణ్‌కి కాలిపోతున్న చిన్న ఒళ్ళు తగిలి షాకయ్యాడు.

"శోభా! కాపిని నీళ్ళు, గుడ్డా పట్రా! చిన్నకి జ్వరం పేలిపోతోంది" అని కేకేశాడు.

అరుణ్ తడి గుడ్డతో ఆరారగా నుదిటిమీద అద్దటంతో కొంచెం జ్వరం నెమ్మదించింది. నింపాదిగా కళ్ళు తెరిచాడు చిన్న. తల నిమురుతున్న అరుణ్‌ని చూశాడు.

"ఏమైందిరా చిన్నా! రాత్రి దాకా బాగానే వున్నావుకదా! లే! బట్టలు మార్చుకో! డాక్టర్ దగ్గరకెళదాం!"

"ఊహూ...వద్దన్నయ్యా! డాక్టరొద్దు...వదినేది?" అరుణ్ వంటింట్లో వున్న శోభని పిల్చాడు. శోభ రాగానే ఆమె చెయ్యి తలమీద పెట్టుకుని

"వదినా! నన్ను హాస్టల్‌కి పంపద్దని అన్నయ్యకి చెప్పవా? నీ దగ్గరే ఉండి చదువుకుంటా! నీలో మా అమ్మ కనిపిస్తోంది వదినా!...అమ్మా!...వదినా!..." అంటూ కళ్ళు మూసుకుని వత్తిగిల్లాడు.

శోభ కళ్ళలోంచి నీళ్ళు ధారగా చెంపల మీదుగా కారుతున్నాయి పశ్చాత్తాపంతో. అనుమానం అనే పెనుభూతం తొలిగిపోయినందుకు హాయిగా ఊపిరి పీల్చుకున్నాడు అరుణ్. ●